‘మల్లన్న’ను దర్శించుకున్న అదనపు ఎస్పీ



మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

చేర్యాల, జనవరి 31 : కొమురవెల్లి మల్లికార్జునస్వామిని మెదక్ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్.మహేందర్ బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు పడిగన్నగారి ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



గద్దర్ ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్ అర్బన్, జనవరి 31 : ప్రజా యుద్ధనౌక గద్దర్ జీవిత చరిత్రను ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని మాలమహానాడు జాతీయ నాయకులు తుమ్మ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గద్దర్ జయంతి సందర్భంగా గజ్వేల్‌లో ఆయన ఫ్లెక్సీకి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో గద్దర్ కీలకపాత్ర పోషించారన్నారు. గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిప్పల యాదగిరి, మాచపురం బాల్‌నర్సయ్య, సత్యనారాయణ, చిప్పల యాదగిరి, శ్రీధర్, ప్రభాకర్, వేణు, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన నాయకుడు గద్దర్

హుస్నాబాద్ టౌన్, జనవరి 31: గద్దర్ జయంతి సందర్భంగా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ లింగమూర్తి మాట్లాడుతూ గద్దర్ తన పాటను తూటాగా మలిచి పాలకులను ప్రశ్నించారని తెలిపారు. హుస్నాబాద్‌లోని అమరవీరుల స్తూపాన్ని తిరిగి పునర్నిర్మించి, స్మృతివనం ఏర్పాటు చేయాలని జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ కొమురయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, ముక్కెర సంపత్‌కుమార్, పోలోజు రవీందర్, రవీందర్, సుధాకర్, వీరసోమయ్య, సింగరి, థామస్, కుమారస్వామి, హసన్, ప్రభాకర్, ఐలేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గద్దర్ జయంతిలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి

దుబ్బాక: సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఎంపీపీ పుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట): సర్పంచ్ దీపికారెడ్డి, సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

దుబ్బాక, జనవరి 31 : గ్రామాభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన సర్పంచుల సేవలు మరువలేనివని ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో బుధవారం దుబ్బాక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. గ్రామాల్లో ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు ఇలా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. నిస్వార్థంతో సేవలందించిన ప్రజాప్రతినిధులుగా సర్పంచులు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరశర్మ, పంచాయతీరాజ్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతి కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, వైస్ ఎంపీపీ రవి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, బనాల శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటారు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 31 : ధూళిమిట్టను మండలంగా ఏర్పాటు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు గ్రామస్తులు రుణపడి ఉంటారని సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ధూళిమిట్ట సర్పంచ్‌తోపాటు ఉపసర్పంచ్ పోతరాజుల మధు, వార్డు సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలాన్ని ఏర్పాటు చేసి ధూళిమిట్ట ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామంలో సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ జ్ఞానేందర్, పంచాయతీ కార్యదర్శి రాజు, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, మాజీ సర్పంచులు సాంబరాజు సీతారామారావు, రచ్చ లక్ష్మయ్య, సుద్దాల రేణుకానర్సింహులు, నాచగోని పద్మాలక్ష్మణ్‌గౌడ్, రిటైర్డ్ సీఈవో మాధవరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల కృషి ఎనలేనిది

కొమురవెల్లి, జనవరి 31 : గ్రామాభివృద్ధి కోసం సర్పంచులు చేసిన కృషి ఎనలేనిదని ఎంపీపీ తలారి కీర్తనాకిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్ష తన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల కృషి మరువలేనిదన్నారు. సర్పంచులను సన్మానించడంతోపాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం లో జడ్పీటీసీ సిద్ధప్ప, ఎంపీడీవో అనురాధ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

హుస్నాబాద్ రూరల్, జనవరి 31 : మండలంలోని పందిల్ల గ్రామంలో బుధవారం ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో సర్పంచ్ తోడేటి రమేశ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేండ్లలో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్‌ను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సేవలు మరువలేనివి

రాయపోల్, జనవరి 31 : గ్రామాల్లో సర్పంచులు చేసిన సేవలు మరువలేవని ఎంపీపీ కల్లూరి అనితాశ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవులు ఎప్పటికీ శాశ్వతం కాదని, మనం చేసిన పనులే మనకు గుర్తింపునిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, కో-ఆప్షన్ సభ్యులు పర్వేజ్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సేవలు మరువలేనివి

తొగుట, జనవరి 31 : సర్పంచుల సేవలు మరువలేనివి ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచులది కీలక పాత్ర

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 31 : తెలంగాణ అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో బుధవారం దుబ్బాక విలేకరులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నూతన పంచాయతీరాజ్ చట్టానికి రూపకల్పన చేసి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. కేసీఆర్ అడుగుజాడల్లో సర్పంచులు నడిచి అభివృద్ధిలో భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. పదవులు ఉన్నా.. లేకున్నా ప్రజల్లో ఉన్నవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజల తరపున సర్పంచులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

మినీ ట్యాంక్‌బండ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, జనవరి 31: మండల కేంద్రంతోపాటు గూడెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన లైబ్రరీ, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, కంపౌండ్ వాల్, షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించారు. ఊర చెరువు వద్ద నిర్మించే మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గూడెంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కవిత, సర్పంచ్‌లు మంజుల, రాజశ్రీ, ఎంపీటీసీ శారద, ఉపసర్పంచ్ వేణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

డిజిటల్ కంటెంట్ పుస్తకాలను అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట, జనవరి 31 : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలు అందిస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు తెలిపారు. బుధవారం పట్టణంలోని పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంటెంట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీశ్‌రావు తన సొంత నిధులతో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజినీకాంత్‌రెడ్డి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ కో-ఆర్డినేటర్ ఇరుగంటి రమేశ్, పెర్క మధు, మెరుగు మాధవ్, రగారం రాము, క్రొళ్ల సతీశ్, మల్యాల పవన్, కొండ ఆదర్శ్, ఎర్రోళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తథ్యం

చేర్యాల, జనవరి 31 : కొమురవెల్లి మల్లికార్జునస్వామిని తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, ఏర్పుల మహేశ్, బూరుగు స్వామిగౌడ్, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న బాలరాజుయాదవ్

నీటి పన్ను చెల్లించాలి

చేర్యాల, జనవరి 31 : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నీటి బిల్లులు తక్షణమే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్డులవారీగా నీటి చార్జీలు చెల్లించాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. పన్నులు చెల్లించని పక్షంలో నీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. నీటి చార్జీలను చెల్లించి మున్సిపల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

బాధిత కుటుబాలకు బియ్యం అందజేత

హుస్నాబాద్ రూరల్, జనవరి 31 : మండలంలోని కూచనపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలకు నేస్తం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు. గ్రామానికి చెందిన మాటూరి రవి ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందగా, అయిలేని సాంబరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న నేస్తం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు, సొసైటీ అడ్వైజర్ మడప రాజిరెడ్డి సహకారంతో బుధవారం మృతుల కుటుంబాలను పరామర్శించి 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. పరామర్శించినవారిలో డీసీసీ కార్యదర్శి మడప యాదవరెడ్డి, సొసైటీ సభ్యులు బండి వంశీ, రంజిత్, నిమ్మకంటి కార్తీక్, శ్రవణ్, జానకీరామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

అక్కన్నపేట, జనవరి 31: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం నేటితో ముగిసినందున వారికి రావాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగిందని, గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. లేదంటే సర్పంచ్‌ల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో వరి పంటల పరిశీలన

రాయపోల్, జనవరి 31 : రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ బాబూనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో వరి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటల సాగు విధానంలో రైతులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవో ప్రశాంత్, రైతులు ఉన్నారు.

అరుదైన వ్యాధులకు ఆపరేషన్లు

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

సిద్దిపేట, జనవరి 31 : వివిధ రకాలైన వ్యాధులతో బాధపడుతున్న నలుగురు రోగులకు అరుదైన ఆపరేషన్లు చేశామని సిద్దిపేట మెడికేర్ రిచ్ వైద్యులు తెలిపారు. బుధవారం దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్డియాలజీ డాక్టర్ ఆనంద్‌రాజ్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రజినీశ్, జనరల్ సర్జన్ డాక్టర్ త్రివిక్రమ్, ఆర్థో సర్జన్ డాక్టర్ కిశోర్ చిట్టా మాట్లాడారు. ముస్త్యాల గ్రామానికి చెందిన మల్లేశానికి హార్ట్ బ్లాక్, హార్ట్ ఎటాక్, పక్షవాతం మూడు ఒకేసారి వచ్చాయని తెలిపారు. ఇలా చాలా తక్కువ మందికి అరుదుగా వస్తుందన్నారు. రోగి బంధువులు మెడికేర్ రిచ్ దవాఖానకు తీసుకురావడంతో ఇక్కడ శస్త్ర చికిత్స నిర్వహించి పూర్తిగా నయం చేశామన్నారు. సిద్దిపేటకు చెందిన మనీషాకు లక్షల్లో ఒకరికి వచ్చే అరుదైన ప్లీహం వ్యాధితో బాధపడుతుండగా, ఆ వ్యాధికి శస్త్ర చికిత్స నిర్వహించి న్యాయం చేశామన్నారు. గంభీర్‌పూర్‌కు చెందిన రాజేందర్‌కు మోషన్, వామిటింగ్స్, జ్వరం మూడు ఒకేసారి వచ్చాయని, క్రియాటినైన్ 13 % పెరగడంతో కిడ్నీలు వాపు వచ్చి పూర్తిగా పాడైపోయే దశలో చికిత్స నిర్వహించి నయం చేశామని వివరించారు. గోనెపల్లి గ్రామానికి చెందిన లింగాచారి తొంటి, నడుము వొప్పి రావడంతో అవాస్కులర్ నేక్రోసిస్ అనే అరుదైన వ్యాధిగా గుర్తించి తొంటిని తొలిగించామన్నారు. దాని స్థానంలో హిప్ రిప్లేస్మెంట్ చేసినట్లు తొంటికి ఆపరేషన్ నిర్వహించి పూర్తిగా నయం చేశామని వైద్యులు తెలిపారు. 15 రోజుల్లో నలుగురు రోగులకు నాలుగు రకాల అరుదైన వ్యాధులను గుర్తించి శస్త్ర చికిత్స ద్వారా నయం చేసినట్లు చెప్పారు. సమావేశంలో డాక్టర్ పరశురాములు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

మాట్లాడుతున్న వైస్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, జనవరి 31 : పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ సంపత్‌కుమార్, వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో అసంపూర్తిగా పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ అధికారులు వార్డుల్లో పర్యటించి పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. పట్టణంలోని ప్రతి స్ట్రీట్ లైట్ వెలగాలని సంబంధిత అధికారులకు సూచించారు. డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులందరూ పట్టణంలో ఎప్పటికప్పుడు పర్యటించి పనులను పరిశీలించాలన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

గజ్వేల్‌అర్బన్, జనవరి 31: ఐదు రోజుల క్రితం మండల పరిధిలోని కొల్గూరులో జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీస్‌కమిషనర్ అనురాధ బుధవారం ప్రకటనలో వెల్లడించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన సుంకరి భాను మద్యం, కల్లు తదితర వ్యసనాలకు అలవాటు పడ్డాడు. తన ఖర్చుల కోసం గతంలో కౌన్సిలర్ చందన భర్త రవీందర్‌కు ఆకాశరామన్న పేరుతో ఉత్తరం రాసి హల్‌చల్ చేశాడు. జనవరి 26న ఉదయం 5.30గంటల సమయంలో కొల్గూరులో శ్రీనివాస్ కిరాణ దుకాణం వారి ఇంట్లో మహిళ శ్యామలతను మెత్తతో నోరు, ముక్కు అదిమిపట్టి మెడపై గల పుస్తెలతాడు, చెవికమ్మలు, రూ.6 వేలు నగదు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనలో శ్యామల మెడకు గాయమై స్పృహ కోల్పోగా చనిపోయిందని భావించి వెనుక దర్వాజ నుంచి పారిపోయాడు. డీసీపీ అందె శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి సూచనల మేరకు ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి కేసును ఛేదించి గజ్వేల్‌కు చెందిన సుంకరి భాను హత్యచేసినట్లుగా నిర్ధారించినట్లు తెలిపారు. హంతకుడి వద్ద మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, కమ్మలు, రూ.54వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన ఏసీపీ రమేశ్, సీఐ సైదా, ఎస్‌ఐ పరశురాం, తొగుట హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, క్రైమ్ కానిస్టేబుళ్లను అభినందించారు.

రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 31 : కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన రూ.2 లక్షల పంట రుణమాఫీని వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మద్దూరు మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

చేర్యాల, జనవరి 31 : మండలంలోని ముస్త్యాల జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.హేమచంద్ర జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మాలత తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో జరిగిన 38వ తెలంగాణ సబ్-జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో హేమచంద్ర ప్రతిభ చూపించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి 11 వరకు రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో హేమచంద్ర పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పీఈటీ ఎం.కొండయ్య, ఎస్ఎంసీ చైర్మన్ చింతల విజయ్‌కుమార్, సర్పంచ్ పెడుతల ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన పావని

గజ్వేల్ అర్బన్, జనవరి 31 : జాతీయ స్థాయి ఫాస్ట్-5 నెట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి పావని సత్తాచాటింది. జనవరి 28 నుంచి 31 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోన్ జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి ఫాస్ట్-5 నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు చెందిన పావని కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించి కాంస్య పతకం సాధించినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పావనితోపాటు రాష్ట్ర జట్టును అభినందించారు.

జెండా గల్లీలో అభివృద్ధి పనులు ప్రారంభం

డ్రైనేజీ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

చేర్యాల, జనవరి 31 : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు జెండా గల్లీలో బుధవారం సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ ముస్త్యాల తారాయాదగిరితో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు నరేందర్, సురేశ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఉడుముల భాస్కర్‌రెడ్డి, సంజీవులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

చేర్యాల, జనవరి 31: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 11,12 తేదీల్లో ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రెండో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎక్కలదేవి సుధాకర్, బాబు, గోవిందరాజు పాల్గొన్నారు.

పౌర హక్కులకు విఘాతం కలిగిస్తే చర్యలు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 31 : పౌరుల హక్కులకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని మద్దూరు ఎస్సై షేక్ యూనూస్ అహ్మద్ హెచ్చరించారు. బుధవారం మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో అంటరానితం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కులాల మధ్య వివక్ష చూపకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీటీ గోపాల్, ఏఎస్సై జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, మాజీ ఎంపీపీ భద్రయ